# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 6 గిగా వాట్ల క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నారు.**

2. **అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

3. **రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.**

4. **నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాతోనే పారిశ్రామికాభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు.**

5. **ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలలకు రేపటి నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యు ఎనర్జీ గ్లోబల్ సంస్థ నిర్మించే 6 గిగా వాట్ల క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తారు. 5 వేల 400 కోట్ల రూపాయల పెట్టుబడులతో ఏర్పాటు అయ్యే ఈ ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తి కానుంది. ఈ ప్రాజెక్ట్ వల్ల సుమారు 2 వేల 100 మందికి ఉపాధి లభిస్తుంది. మొత్తం 5 వేల 400 కోట్ల రూపాయల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టులో సుమారు 4 వేల 200 కోట్ల రూపాయల పెట్టుబడితో 6 గిగా వాట్ల సోలార్ ఇంగాట్ వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. మరో 12 వందల కోట్ల రూపాయల వ్యయంతో 125 మెగా వాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టును నిర్మించనునారు.

---------------------------

దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సులతో పాటు ఇతర వేదికల్లో ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలు, సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, కంపెనీలకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి

అన్నారు. పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

---------------------------

బాలల హక్కుల పరిరక్షణలో కమిషన్‌కు పూర్తిస్థాయి లో ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యులు మంత్రిని గుంటూరు జిల్లా అమరావతి సచివాలయంలో నిన్న కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడతూ.. తమ హక్కుల కోసం అడగలేని బాలల తరపున కమిషన్ నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం బాలల సంక్షేమానికి, వారి హక్కుల రక్షణకు ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు.

---------------------------

ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనను మరింత వేగంగా అమలు చేయాలని నిన్న విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో చెప్పారు. సూక్ష్మ, చిన్న ,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన పెట్టుబడిని బ్యాంకులు స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ ద్వారా సమకూర్చేలా వార్షిక రుణ, పెట్టుబడి ప్రణాళిక తయారు చేయాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

---------------------------

నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాతోనే పారిశ్రామికాభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. దీనికి అనుగుణంగానే ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు వాటికి అవసరమైన విద్యుత్ ను అందిస్తోందని అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్లను నిన్న ప్రారంభించారు. శ్రీసిటీలో జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ...రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. శ్రీసిటీలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలకు అన్ని విధాలా ఎన్డీయే ప్రభుత్వ మద్దతు ఉంటుందని చెప్పారు

---------------------------

తెలంగాణాలో సమ్మె చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె విరమించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రోజు 40 లక్షల మంది మహిళలు సహా 65 లక్షల మంది ప్రయాణికుల అవసరాలు తీరుస్తున్న ఆర్టీసీని స్తంభింప చేయరాదని కోరారు. 32 డిమాండ్లలో 29 డిమాండ్లను ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, విలీనం, కార్మిక సంఘాల గుర్తింపు వంటి సాంకేతిక అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెపుతూ పొన్నం ప్రభాకర్ ....

వాయిస్ ...33 సెకండ్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని  పాఠశాలలకు రేపటి నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. జూన్  12వ తేదీన బడులు  మళ్లీ ప్రారంభం అవుతాయి.  వేసవి సెలవల్లో విద్యార్థులు ఎండలో తిరగకుండా ఉండాలని... అవసరమైన జాగ్రత్తలపై ఈరోజు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించింది. తల్లిదండ్రులకు కూడా సూచనలు చెప్పి, పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని  పాఠశాల విద్యాశాఖ విడుదల  చేసిన ప్రకటనలో పేర్కొంది.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 133 వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

-----------------------------

ఐపీఎల్ క్రికెట్‌లో భాగంగా  నిన్నరాత్రి  లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో  లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్  జట్టు  మధ్య జరిగిన మ్యాచ్‌లో  40 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టు 18 ఓవర్ల లో 119 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. కాగా.. ఈ రోజు రాత్రి ఏడున్నర గంటలకు ముంబైలో జరిగే మ్యాచ్‌లో  ముంబై చెన్నై  జట్లు తలపడనున్నాయి.

-----------------------------

విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని 100 రూపాయల  వెండి నాణెం విడుదల చేయనున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్  కేంద్ర ప్రభుత్వం నిన్న  విడుదల చేసింది. 35 గ్రాముల బరువు, 44 మిల్లీమీటర్ల వ్యాసార్థం ఉండే ఈ నాణేన్ని 50% వెండి, 40% రాగి, 5% నికెల్, 5% జింక్‌తో రూపొందిస్తున్నారు. నాణేనికి ఒకవైపు సత్యమేవ జయతే అన్న సూక్తితో కూడిన నాలుగు సింహాల అశోక స్తూపం, 100 రూపాయలను, హిందీ, ఇంగ్లీష్‌లో భారత్, ఇండియా అన్న అక్షరాలు ఉంటాయి.  మరోవైపు ఆంధ్రా విశ్వవిద్యాలయం అధికారిక లోగో, దానికి కుడి ఎడమల్లో 1926, 2026 సంవత్సరాలు, ఆంధ్రా విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు అని హిందీ, ఇంగ్లీష్‌లో ఉంటాయని కేంద్ర ఆర్థిక శాఖ  విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ లో గంజాయి, డ్రగ్స్ వాడకాన్ని ఉక్కు పాదంతో అణచి వేయాలని ప్రభుత్వ  ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఆదేశించారు. ఇదొక సామాజిక సమస్య అని,  వీటి నియంత్రణ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించగలిగితేనే పూర్తి స్థాయిలో నివారించ గలుగుతామని గుంటూరు జిల్లా అమరావతి సచివాలయంలో నిన్న జరిగిన నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన అన్నారు.  యువత, విద్యార్థుల్లో గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను సేవిస్తే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నకార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు.

======================